క్లుప్తంగా

25 నుంచి మాచుపల్లె దర్గా ఉరుసు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని మాచుపల్లెలోని హజరత్ సయ్యద్ షావలి దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 25నుంచి 27వ తేది వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు జీసీ సాయి సుబ్బరాయుడు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి 7 నుంచి 10 గంటల వరకు పూలచాం దినీని ఫకీర్ల మేళతాళాలు, విన్యాసాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించనున్నామని, అనంతరం దర్గాకు చేరి గురువుల మజార్ వద్ద గంధం సమర్పించి ఫాతెహా నిర్వహిస్తామని తెలిపారు. 26న ఉరుసు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అదేరోజు రాత్రి ప్రముఖ ఖవ్వాలీ గాయకులు సర్ఫరాజ్ సాబిరి, అయేషా తాజ నిజామిల ఖవ్వాలీ కచేరీ ఉంటుందన్నారు. మధ్యాహ్నం, రాత్రి దర్గా వద్ద అన్నదానం నిర్వహిస్తామన్నారు. 27న శుక్రవారం తహలీల్ ఫాతెహా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ ప్రజా నాట్య మండలి నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రపై మంగళవారం కడప కళాక్షేత్రంలో నిర్వహించనున్న నాటకాన్ని జయప్రదం చేయాలని ఏపీ ప్రజా నాట్య మండలి జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రారా గ్రంథాలయంలో అంబేద్కర్ జీవిత చరిత్రపై నిర్వహ/ంచే నాటకాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఏపీ ప్రజా నాట్య మండలి నాయకులు చంద్రశేఖర్, కొమ్మద్ది ఈశ్వరయ్య, మునెయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి

– డీఈఓ దేవరాజుకు యూటీఎఫ్ వినతి


డీఈఓ దేవరాజుకు వినతిపత్రమిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న 2018 డీఎస్సీ ఉపాధ్యాయుల ప్రొబేషన్ డిక్లరేషన్ కాలేదన్న నెపంతో వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వలేదని వారికి వెంటనే ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, జిల్లా కార్యదర్శి దావుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం డీఈఓ దేవరాజును కడప డీఈఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ప్రొబేషన్ డిక్లరేషన్‌ను జీతాలకు ముడి పెట్టకుండా వారికి ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణ, జావిద్ పాల్గొన్నారు.

యూబీఐ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అందిస్తున్న రుణ పథకాలను పరిశ్రమల యజమానులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయ డీజీఎం జూన రోసిలినా తెలిపారు. సోమవారం కడప యూనియన్ బ్యాంకు అధికారులు ప్రొద్దుటూరు పట్టణంలో సూక్ష్మ, చిన్న పరిశ్రమల యజమానులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం రుణ సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యూబీఐ కడప ప్రాంతీయ కార్యాలయ ఇన్‌ఛార్జి భాస్కర్, ఎంఎస్ఎంఈ లోన్ పాయింట్ ఇన్‌ఛార్జి పరుశురాం నాయక్‌తోపాటు పలువురు వ్యాపారులు, ట్రేడర్లు, బంగారు వ్యాపారస్తులు, వస్త్ర వ్యాపారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, ఉపాధ్యాయల సమస్యల పరిష్కారమే లక్ష్యం

– యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్: విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశామన్నారు. ప్రభుత్వ మెప్పు కోసం అధికారులు చిన్నచిన్న తప్పులకు కూడా మెమోలు, షోకాస్‌లు,సస్పెండ్‌లకు పూనుకోడం బాధాకరమన్నారు. జిల్లా సహాధ్యక్షురాలు రూతు ఆరోగ్యమేరీ, జిల్లా కార్యదర్శులు దావుద్దీన్, చంద్రశేఖర్, నాయకులు రమణ, కరీముల్లా పాల్గొన్నారు.

కన్యకాంబ నమోస్తుతే!

కడప కల్చరల్ : శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నకాష్‌లోని శ్రీ పాండురంగస్వామి ఆలయం వద్ద నుంచి ఉభయదారులు ప్రధాన కలశం ధరించగా 102 మంది దీక్షలో ఉన్న కన్యకలు క్షీర కలశాలతో అమ్మవారిశాల వరకు ఊరేగింపుగా వచ్చారు. ఆ కళశాలలోని క్షీరంతో అమ్మవారిని అభిషేకించి అలంకారం, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ కన్యకాంబ ఆలయంలో మూల మూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అభిషేకం, అర్చన, నివేదన, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం దీక్షలో ఉన్న బాలికలు, కన్యకలు, ముత్తయిదువులకు వాయినాలు సమర్పించారు. ఉభయదారులతో గణపతి పూజ, నవగ్రహ, రుద్ర, సుదర్శన, అయుష్హ హోమాలు, పరివార దేవతలకు చండీహోమాలు నిర్వహించి, పూర్ణాహుతి , ప్రసాద వితరణ చేశారు. యాగ అగ్నిహోత్రంతో ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన అగ్నిగుండాన్ని జ్వలింపజేశారు. అనంతరం మొక్కులుగల ఇతర భక్తులంతా అమ్మవారి ఆత్మార్పణలో పాలుపంచుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం ఈ సందర్భంగా స్థానిక పాండురంగ స్వామి ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా వస్తూ ఆర్యవైశ్య మహిళా భక్తులు కోలాటం వేశారు. సాయంత్రం అమ్మవారిశాల ఎదురుగా అగ్ని గుండాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్యవైశ్య భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం మాడవీధులు జనంతో నిండిపోయాయి. ధర్మకర్తలు బెస్తవేముల రామమహేష్, రాంప్రసాద్, శ్రీను, చీతిరాల సాయి, కృష్ణ కిశోర్, సత్యనారాయణ పాల్గొన్నారు.


వ్రతం ఆచరిస్తున్న మహిళా భక్తులు


కలశాలతో అమ్మవారి ఆలయానికి చేరుకున్న భక్తులు


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

సీమ కీర్తి కిరీటాలు వావిలికొలను, రాళ్లపల్లి

కడప కల్చరల్ : ప్రముఖ కవులు వావిలికొలను సుబ్బారావు, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ రాయల సీమ కీర్తి కిరీటాలని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం వావిలికొలను, రాళ్లపల్లి జయంతులను పురస్కరించుకుని బ్రౌన్ కేంద్రంలో ఇతర అతిథులతోకలిసి మూల మల్లికార్జునరెడ్డి ఆ కవుల చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి , బ్రౌన్ కేంద్రం గ్రంథ పాలకులు ఎస్.రమేష్‌రావు, ఒంటిమిట్ట ఆలయ అర్చకులు నరసింహాచార్యులు తదితరులు కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో కొత్తపల్లి రామాంజనేయులు, గ్రంథ పాలకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు వెంకట రమణ, మౌనిక పాల్గొన్నారు.


వావిలికొలను, రాళ్లపల్లి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పర్యవేక్షక ఇంజినీరు రత్నాల రాజు, సిటీ ప్లానర్ సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన «స్పందన» కార్యక్రమంలో వారు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 15 అర్జీలు రాగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి-3, ఇంజినీరింగ్ విభాగం-2, యూపీఏ విభాగం-4, పబ్లిక్ హెల్త్ విభాగం-1, కడప తహసీల్దార్-3, రెవెన్యూ విభాగం-1, హౌసింగ్ విభాగానికి సంబంధించి ఒక అర్జీ వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని వారు అధికారులకు సూచించారు. ఎంహెచ్ఓ డా. ప్రశాంత్ వర్ధన్, డీఈలు కరిముల్లా, వేణుగోపాల్, రాజేష్, ఆర్ఓలు విజయ్ భాస్కర్ గౌడ్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్ఈ రత్నాల రాజు, సిటీప్లానర్ సంజీవ్ కుమార్

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వద్దు

– సీపీఐ, ఏఐటీయూసీ నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలోని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించరాదని, ఈ విషయంగా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, సేవ్ విశాఖ స్టీల్ ప్లాంటు, ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టిన బీజేపీ, మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వద్దు అంటూ కార్మికులు, నిర్వాసితులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నా పాలకులు పెడచెవిన పెట్టడంతో ఈనెల 30న విశాఖలో భారీగా లక్ష మందితో కార్మికుల గర్జన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ గర్జనకు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టినట్లు వివరించారు. అలాగే ఈనెల 25న కడప కలెక్టరేట్ వద్ద దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, బషీరున్నీసా, చంద్రశేఖర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రక్షణ జీవన శైలిలో భాగం కావాలి

కడప కల్చరల్ : పర్యావరణ రక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటిని చెట్లుగా పెంచడం మన జీవన శైలిలో భాగం కావాలని ఎల్ఐసీ కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. దేశ వ్యాప్తంగా సొంత భవనాలుగల అన్ని ఎల్ఐసీ సెంటర్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్న పిలుపు మేరకు సోమవారం డివిజనల్ కార్యాలయ ఆవరణలో అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎం గిరిధర్ మాట్లాడుతూ గత శతాబ్దాలలో కంటే ఇప్పుడు పర్యావరణ సమతుల్యతను సాధించడం పెద్ద ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. కాలుష్యాన్ని తగ్గించడం, అటవీ భూమిని కాపాడుకోవడం చాలా అవసరమన్నారు. ఎల్ఐసీ అధికారులు జగన్నాథ శ్రీనివాస్, ఆనందరావు, పీఆర్ఆర్‌సీ కుమార్, సరళ, సుధ, పద్మజ, శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న ఎల్ఐసీ కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ గిరిధర్

పీఏసీఎస్‌లు లాభాల బాటలోకి రావాలి

– ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) లాభాల బాటలోకి రావాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని డీసీసీ బ్యాంకు ఆవరణలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం బ్రాంచిల పరిధిలోని పీఏసీఎస్ సీఈఓలు, సూపర్‌వైజర్లు, బ్రాంచి మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృఢమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే పీఏసీఎస్‌లకు ఎంఎస్‌సీలో భాగంగా నాబార్డు సౌజన్యంతో 4 శాతం వడ్డీకి ఏ వ్యాపారం చేయడానికైనా లోన్ అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పీఏసీఎస్‌లు లాభాలబాటలోకి రావాలని తెలిపారు. నష్టాల్లో ఉన్న కడప డీసీసీ బ్యాంకు ఇప్పుడు లాభాల బాటలో ఉందన్నారు. సహకార వ్యవస్థపై రైతులకు, ప్రజలకు నమ్మకం పెంచాలని కోరారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కడప డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సంకల్పం ఉంటే ఎంతటి కష్టాన్ని, నష్టాన్ని అయినా ఎదుర్కోవచ్చన్నారు. నాబార్డు డీడీఎం మాట్లాడుతూ పీఏసీఎస్‌లను లాభాల్లోకి తెచ్చేందుకు సీఈఓలు ముందుకు రావాలని తెలిపారు. పీఏసీఎస్‌ల సీఈఓలు, బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి


విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులందరూ విద్యలో నిర్దేశిత సామర్థ్యాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం కడపలోని సీఎస్ఐ స్కూల్లో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్)పై కడప మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్‌లో సామర్థ్యాలు సాధించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఇందుకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ పాలెం నారాయణ మాట్లాడారు. లిప్ రిసోర్స్ పర్సన్స్ గంగాధర్, సురేష్, స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు లిప్ ప్రీ టెస్టును నిర్వహించి విద్యార్థుల గ్రేడింగ్ రిజిస్టర్ చేయాలని సూచించారు. బోధనను టీచింగ్ పీరియడ్లు, ప్రాక్టీస్ పీరియడ్లుగా విభజించుకోవాలని తెలిపారు. ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో

బాలల చట్టాలపై అవగాహన కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలల చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. సోమవారం కడప నగర శివార్లలోని ఆశా నిలయంలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ వారు ప్రవేశపెట్టిన నల్సా పథకాలైన బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవల పథకం-2015, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ విభిన్న ప్రతిభావంతుల పిల్లల కోసం న్యాయ సేవా పథకం-2021పై విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. ఇందులో 18 ఏళ్ల లోపు బాలలందరికీ సెక్షన్ 12(1) సీ న్యాయ సేవాధికార సంస్థ చట్టం ప్రకారం ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే బాలల సంక్షేమ, సంరక్షణ గృహాలు, స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న గృహాలు, బాలల న్యాయ చట్టం సెక్షన్ 33 రూల్ నెంబరు 71 ప్రకారం నమోదు జరిగేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, ఎన్జీఓలు, విభిన్న ప్రతిభావంతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

మహిళా పోలీసులతో నిరంతర గస్తీ

కడప అర్బన్: కడప ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్, దిశ మహిళా పోలీసులతో సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు దిశ డీఎస్పీ ఆర్. వాసుదేవన్, ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి నేతృత్వంలో మహిళా పోలీసులతో గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు కడపలోని పాఠశాలలు, కళాశాలలు, మహిళలు తిరిగే ప్రాంతాల్లో ఎప్పటికపుడు తిరుగుతూ ఈవ్‌టీజింగ్ నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలియజేశారు. వీరికి బ్లూకోల్ట్స్, రక్షక్, ట్రాఫిక్, సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల సమన్వయంతో నేర నివారణకు చర్యలు చేపట్టామని వివరించారు. ప్రత్యేక దిశ వాహనాల్లో ఎప్పటికప్పుడు మహిళలకు చైతన్యం కలిగించడంతో పాటు దిశ యాప్‌పై అవగాహన కల్పించేలా ఆదేశాలు జారీ చేశామని వివరించారు. విద్యార్థినులు, అమ్మాయిలపై అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్ఐలు వెంకటయ్య, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాఫిక్, దిశ మహిళా పోలీసులతో ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐలు

అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి కోరారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచి ప్రభుత్వమే వంట గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో ప్రాజెక్టు కార్యాలయం వద్ద, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళనలను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బ్రహ్మంగారి మఠంలోని గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠంలోని బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులను సగిలేరు గురుకుల పాఠశాలకు రాత్రికి రాత్రే తరలించడం దారుణమన్నారు. విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడటం వల్లన బ్రహ్మంగారిమఠంలోనే కొనసాగించాలని కోరారు.

అంబేద్కర్‌ను దూషించిన వారిపై చర్యలు చేపట్టాలి

కడప సెవెన్‌రోడ్స్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అసభ్య పదజాలంతో దూషించిన రాయలసీమ యూనివర్శిటీ సూపరింటెండెంట్ ఇస్మాయిల్, సంఘటనకు కుట్రదారుడైన శ్రీనివాసరావును అరెస్టు చేసి ఉద్యోగాల నుంచి తొలగించాలని ఏపీదళిత మిత్ర సంఘ అధ్యక్షులు కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కర్నూలులో పనిచేస్తున్న వీరు ఉద్దేశ్య పూర్వకంగానే అంబేద్కర్‌ను దూషించడమే కాకుండా మాదిగలను కించపరుస్తూ మాట్లాడిన ఆడియోలను వాట్సాప్ గ్రూపుల్లో బహిరంగ పరిచారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989 సవరణ చట్టాన్ని 2016, 2018 ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మద్దిలేటి, జిల్లా గౌరవ అధ్యక్షులు చాంద్‌బాషా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కడప ఆర్డీఓకు వినతిపత్రమిచ్చారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఇవ్వాలని, మెస్ ఛార్జీలను వెంటనే పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గంజికుంట నాగరాజు, సుబ్బరాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోటింగ్‌ను ప్రారంభించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని పాత కడప చెరువు బోటింగ్‌ను పునః ప్రారంభించాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని కడప బ్రహ్మోత్సవాల జరుగుతున్న సమయంలో బోటింగ్ చేసే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. బోటు షికారు ప్రాంతంలో చిన్న పిల్లల పార్కును ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోటింగ్‌కు మరమ్మత్తులు చేపట్టి ఆపరేటర్‌ను నియమించాలన్నారు. సీపీఐ నాయకులు మద్దిలేటి, మనోహర్ రెడ్డి, నాగరాజు, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను.. నగరంలోని 4వ డివిజన్ ఎన్జీఆర్ నగర్‌లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. సోమవారం స్పందనలో స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

యువజనోత్సవాల్లో విద్యార్థినుల ప్రతిభ

వైవీయూ : కర్నాటక రాష్ట్రంలోని ధార్వాడలో జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి యువజనోత్సవాల్లో కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు చక్కటి ప్రతిభ కనబరిచారు. ఏపీ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన వీరు కర్రసాము, కత్తిసాము ప్రదర్శన చేసికట్టుకున్నారు. అదే విధంగా ఈనెల 26న కడప నగరంలోని రిపబ్లిక్ డే వేడుకల్లో వీరు కర్రసాము, కత్తిసాము ప్రదర్శన ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. సూర్యనారాయణరెడ్డి తెలిపారు. కోచ్ జయచంద్రను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ పీఓ సుబ్బనరసయ్య పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు

వైవీయూ: కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో నేతాజీ సుభాష్‌చంద్రబోష్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం నగర పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో నేతాజీ చిత్రపటానికి వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఫజుల్ రెహమాన్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శమన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో రాజీలేని పోరాటం కొనసాగించిన యోధుడన్నారు. 2021 నుంచి ఏటా జనవరి 23ను పరాక్రమ దివస్‌గా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు అబ్దుల్ హక్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాస్, ఏఎఫ్‌యూ డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో.. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నేతాజీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, అధ్యాపకులు శివపార్వతి, వై. సావిత్రి, నాగరాజు, రవిశేఖర్, శ్రీనీత పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో.. కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. అశోక్ , రాహుల్, ఆషిక్, గణేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..
కడప వైఎస్ఆర్ సర్కిల్: భారత స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో బోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.


వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో నేతాజీకి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్‌లు


ఆర్ట్స్ కళాశాలలో నేతాజీ జయంతి వేడుకలు

జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి కృషి

కడప స్పోర్ట్స్: జిల్లాలో క్రికెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) నూతన కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో క్రికెట్ నెట్స్ కేంద్రాన్ని ఆయన ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్.ఖాజామైనుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. నిబద్ధతతో, రోజూ క్రమం తప్పకుండా సాధన చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. రంజీ మాజీ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్‌కుమార్ క్రీడాకారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు కె.విష్ణుమోహన్‌రావు, ఎస్. మహమ్మద్ ఇలియాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్నఅవ్వారు రెడ్డిప్రసాద్

ఉత్సాహంగా హాకీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి శాప్‌లీగ్ హాకీ అండర్-19 ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి.అమృత్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతో పేరుమోసిన హాకీ క్రీడాకారులు ఉన్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఫిబ్రవరి 3, 4 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి శాప్‌లీగ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. డీఎస్ఏ హాకీ కోచ్ పి. కల్యాణ్‌కుమార్, క్రీడా పాఠశాల శిక్షకుడు అనిల్ పాల్గొన్నారు.